క్లుప్తంగా

ఇన్‌చార్జి ఎస్‌ఐగా రామకృష్ణ

మునగపాక: మునగపాక పోలీసు స్టేషన్ ఇన్‌చార్జి ఎస్‌ఐగా అనకాపల్లి ట్రాఫిక్ ఎస్‌ఐ రామకృష్ణ బాధ్యతలు నిర్వహిస్తున్నారు. మునగపాక ఎస్‌ఐ పి.ప్రసాదరావు వ్యక్తిగత సెలవుపై వెళ్లడంతో ఆయన స్థానంలో రామకృష్ణను నియమించారు. నాలుగు రోజుల పాటు రామకృష్ణ ఇన్‌చార్జి ఎస్‌ఐగా సేవలందించనున్నారు.

ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి

మునగపాక: ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక దోహదపడుతుందని తహసీల్దార్ పి.సత్యనారాయణ అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పరిష్కార వేదికలో భాగంగా సోమవారం ఆయన అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో సమస్యలను త్వరితగతిన పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. వ్యక్తిగత సమస్యల పరిష్కారానికి కూడా చర్యలు తీసుకుంటామన్నారు. మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ సీహెచ్.లక్ష్మి, ఉపాధి హామీ పథకం ఏపీవో శివ, ఈవోఆర్డీ సోమరాజు, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సత్తెమ్మతల్లి ఆలయ నిర్మాణానికి విరాళాలు


సత్తెమ్మతల్లి గుడికి విరాళం అందిస్తున్న పరమేష్

మునగపాక: మునగపాక చెరువు కాలువ సంఘ పరిధిలో నిర్మిస్తున్న సత్తెమ్మతల్లి అమ్మవారి గుడి పనులు చురుగ్గా సాగుతున్నాయి. పలువురు భక్తులు తమవంతు సాయం అందజేస్తున్నారు. దీనిలో భాగంగా మూలపేటకు చెందిన మొల్లేటి పరమేష్ ఆలయ నిర్మాణానికి అవసరమైన రూ.50 వేలు విలువ చేసే ఇటుకను సమకూర్చారు. మూలపేటకు చెందిన మొల్లేటి రాజేశ్వరరావు కుమారుడు గోవిందరావు ఆలయ నిర్మాణానికి రూ.5 వేలు విరాళం అందజేశారు. ఈ కార్యక్రమంలో సంఘ అధ్యక్షుడు దాడి చంద్రరావు, సభ్యులు బొడ్డేడ అప్పలనాయుడు, ఆడారి జగ్గారావు, వెలగా వెంకటప్పారావు, వెలగా ధర్మసూరి, వెలగా శ్రీనివాసరావు, వెలగా జగన్నాథరావు, తదితరులు పాల్గొన్నారు.

జీఎస్టీపై అవగాహన అవసరం



యలమంచిలిలో వ్యాపారులకు జీఎస్టీ 2.0పై అవగాహన కల్పిస్తున్న అధికారులు

యలమంచిలి రూరల్: కేంద్ర ప్రభుత్వం సవరించిన వస్తు సేవల పన్ను (జీఎస్టీ 2.0)పై వ్యాపారులకు, ప్రజలకు స్పష్టమైన అవగాహన ఉండాల్సిన అవసరం ఉందని ప్రత్యేకాధికారి స్వర్ణలత అన్నారు. సోమవారం యలమంచిలి పట్టణ పరిధిలో పలు సెలూన్ షాపులు, బ్యూటీ పార్లర్లకు ఆమె స్థానిక మున్సిపల్ అధికారులతో వెళ్లి జీఎస్టీ 2.0లో కేంద్ర ప్రభుత్వం చేసిన మార్పులను వివరించారు. దీని వల్ల వ్యాపారులు, ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ పిల్లా రమాకుమారి, కమిషనర్ బీజేఎస్ ప్రసాదరాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ పల్లా శ్రీనివాసరావు, మెప్మా సీఎంఎం పద్మావతి, సచివాలయం, పారిశుధ్యం, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

అచ్యుతాపురం: నియోజకవర్గ అభివృద్ధికి అన్ని శాఖల అధికారులు కృషి చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయ్‌కుమార్ కోరారు. అచ్యుతాపురంలోని తన క్యాంప్ కార్యాలయంలో సోమవారం నాలుగు మండలాలకు చెందిన వివిధ శాఖల అధికారులతో అభివృద్ధి పనులపై సమీక్ష నిర్వహించారు. అచ్యుతాపురం ఫ్లైఓవర్ పనుల పురోగతిపై ఆరా తీశారు.

అ'పూర్వ' కలయిక


పూర్వ విద్యార్థులు అందజేసిన కాంపిటేటివ్ మెటీరియల్‌తో విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఎస్.రాయవరం: దార్లపూడి ఉన్నత పాఠశాలలో 1994–95 బ్యాచ్ పదో తరగతి విద్యార్థులు సోమవారం సందడి చేశారు. పూర్వ విద్యార్థులంతా సమావేశమై ఆనాటి తీపి జ్ఞాపకాలు, చిలిపి చేష్టలు గుర్తుకు తెచ్చుకుని మురిసిపోయారు. అనంతరం రూ.11 వేలు విలువ చేసే కాంపిటేటివ్ పుస్తకాలు, ఆట వస్తువులు కొనుగోలు చేసి పాఠశాలకు అందజేశారు. ఈ కార్యక్రమంలో దార్లపూడి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం జాన్, పూర్వ విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

వరి చేనుపై తెగుళ్ల ముప్పేట దాడి

- కలవరపడుతున్న అన్నదాతలు
- అదనపు పెట్టుబడి భారంతో ఆర్థిక కష్టాలు
- తెగుళ్ల నివారణకు కానరాని అవగాహన


మునగపాకలో సుడిదోమ తెగులు సోకిన వరి పైరు


మునగపాక నుంచి వాడ్రాపల్లికి వెళ్లే దారిలో పొడతెగులు సోకిన వరి పైరు

మునగపాక: ప్రస్తుతం పొట్ట దశలో ఉన్న వరి పైరుపై పలు రకాల తెగుళ్లు దాడి చేస్తున్నాయి. వర్షాలు కురవడం, వేసవిని తలపించేలా ఎండలు కాస్తుండడం వంటి వాతావరణ మార్పుల కారణంగా తెగుళ్లు విజృంభిస్తున్నాయి. ప్రస్తుతం వరి పొలాల్లో పొడ తెగులు, సుడిదోమ తెగుళ్లు వెంటాడుతున్నాయి. పంటను కాపాడుకునేందుకు రైతులు అవస్థలు పడుతున్నారు. వేలాది రూపాయల పెట్టుబడులను తెగుళ్ల నివారణకు ఖర్చు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు.

వాతావరణ మార్పులతో ముప్పు

వాతావరణ మార్పులతో వరి పైరుకు నష్టం వాటిల్లుతుంది. భారీ వర్షాలు కురిసి ఆగిపోవడం.. ఎండలు వేసవికి మించి కాయడంతో వరి పైరు దెబ్బతింటుంది. వరి నాట్లు వేసి 35 నుంచి 40 రోజులకు పైబడి కావస్తున్నా పంట ఎదుగుదల లోపిస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. పలు రకాల తెగుళ్లు వరిని ఆశించడంతో నివారణకు ప్రైవేటు దుకాణాల నుంచి ఎరువులను కొనుగోలు చేయాల్సి వస్తుందని వాపోతున్నారు. పంటను కాపాడుకునేందుకు పలు రకాల మందులను పిచికారీ చేస్తున్నా ఫలితం లేకుండా పోతుందని గగ్గోలు పెడుతున్నారు.

లక్ష్యానికి మించి వరిసాగు

మండల వ్యాప్తంగా వరి సాగు ఖరీఫ్‌లో లక్ష్యానికి మించి జరిగింది. ఖరీఫ్ సీజన్‌లో వరి సాధారణ విస్తీర్ణం 1456 హెక్టార్లు కాగా.. ప్రస్తుతం 1505 హెక్టార్లకు పైగా సాగు జరిగినట్లు అధికారులు తెలిపారు. మునుపెన్నడూ లేని విధంగా ఈ సంవత్సరం ఆశించిన మేర వరి సాగు జరిగింది. వాతావరణం అనుకూలంగా లేకపోవడంతో పంటలకు చీడపురుగుల బెడద ఎక్కువగా ఉంది.

అవగాహన లేక నష్టపోతున్న రైతులు

తెగుళ్ల నివారణకు ఎప్పటికప్పుడు రైతులకు అవగాహన కల్పించడంలో అధికారులు విఫలమయ్యారన్న ఆరోపణలు ఉన్నాయి. సమీపంలోని రైతు సేవా కేంద్రాలకు వెళ్తున్నా స్పందన అంతంతమాత్రంగా ఉంటుందని రైతులు వాపోతున్నారు. పురుగు మందులను ఎంత మోతాదులో, ఏ మందులను వినియోగించాలో కనీసం చెప్పడం లేదంటూ మండిపడుతున్నారు. దీంతో తెగుళ్ల నివారణకు రైతులకు ఆర్థిక భారం తప్పడం లేదు.

అధిక వర్షాలతో నష్టం



అధిక వర్షాలు కురవడంతో వరి పైరుకు తీరని నష్టం వాటిల్లుతుంది. తెగుళ్ల బెడద ఎక్కువగా ఉంటుంది. పొడ, సుడిదోమ తెగుళ్ల కారణంగా వరి పైరు ఎదుగుదల లోపిస్తుంది. వ్యవసాయాధికారులు గ్రామాల్లో నివారణ మార్గాలను వివరించాల్సిన అవసరం ఉంది.

– నరాలశెట్టి సూర్యనారాయణ, రైతు, ఒంపోలు

పెరుగుతున్న పెట్టుబడి ఖర్చులు



పొడ తెగులు, సుడిదోమతో పంట నాశనమవుతుంది. వరి సాగు చేపట్టాలంటేనే భయంగా ఉంటుంది. ఒకవైపు పెట్టుబడుల ఖర్చు పెరిగిపోతుంది. పంటలకు సోకుతున్న తెగుళ్ల కారణంగా వేలాది రూపాయల పెట్టుబడి అదనంగా అవుతుంది. అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి తెగుళ్ల నివారణపై అవగాహన కల్పించాలి.

– బొడ్డేడ చెల్లయ్యనాయుడు, రైతు, మూలపేట

ఉప్పొంగిన గెడ్డ.. స్తంభించిన రాకపోకలు


పొంగి ప్రవహిస్తున్న కొడవటిపూడి గెడ్డ


మెయిన్ రోడ్డులో నిలిచిపోయిన వాహనాలు

కోటవురట్ల: కొడవటిపూడి గెడ్డ వర్షం నీటితో ఉప్పొంగింది. స్థానికంగా సోమవారం సుమారు గంట పాటు కురిసిన భారీ వర్షానికి ఎగువ ప్రాంతాల నుంచి గెడ్డలోకి వరద నీరు చేరింది. దాంతో లింగాపురం–కొడవటిపూడి మెయిన్‌రోడ్డులో నుంచి ఉన్న ఈ గెడ్డలోకి భారీగా ప్రవాహం వచ్చింది. రోడ్డు మధ్యలో ఉన్న ఈ గెడ్డ పొంగి ప్రవహించడంతో ఇరువైపులా రాకపోకలు స్తంభించిపోయాయి. ఇటు కోటవురట్ల, అటు కాకినాడ జిల్లా తుని వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి కావడంతో వాహనదారులు అవస్థలు పడ్డారు. సుమారు అరగంట పాటు గెడ్డకు రెండు వైపులా వాహనాలు నిలిచిపోయాయి. విద్యార్థులు, చిన్నారులు, వృద్ధులు, మహిళలు ఇబ్బంది పడ్డారు.

23వ రోజుకు మత్స్యకారుల ఆందోళన


దీక్ష కొనసాగిస్తున్న మత్స్యకారులు

నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్క్‌ను రద్దు చేయాలంటూ రాజయ్యపేట మత్స్యకారులు చేస్తున్న నిరాహార దీక్ష 23వ రోజుకు చేరుకుంది. సోమవారం వారి దీక్షకు వైఎస్సార్‌సీపీకి చెందిన కాపు కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వీసం రామకృష్ణ, మండల శాఖ అధ్యక్షుడు శీరం నర్సింహమూర్తి, తదితరులు సంఘీభావం ప్రకటించారు. మత్స్యకారులతో పాటు దీక్షలో కూర్చున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మత్స్యకారుల అభిప్రాయాలను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకోవాలన్నారు. నెల రోజుల క్రితం నిర్వహించిన ప్రజాభిప్రాయ సేకరణలో నూటికి 90 శాతం మంది ఈ బల్క్ డ్రగ్ పార్క్‌ను వ్యతిరేకించారని గుర్తు చేశారు. రాజయ్యపేట గ్రామస్తులే కాకుండా పరిసర ప్రాంత గ్రామాల ప్రజలు కూడా తీవ్రంగా వ్యతిరేకించారన్నారు. అయినా ప్రభుత్వం మొండిగా వ్యవహరించడం తగదన్నారు. తక్షణమే మత్స్యకారుల అభిప్రాయాలను గౌరవిస్తూ బల్క్ డ్రగ్ పార్క్‌ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఎరిపిల్లి నాగేశు, సోమేష్, నూకరాజు, మహేష్, తదితరులు పాల్గొన్నారు.

రీ సర్వే వేగవంతం కావాలి

మునగపాక: ప్రభుత్వ భూముల పరిరక్షణకు పాటుపడాలని తహసీల్దార్ పి.సత్యనారాయణ కోరారు. స్థానిక రెవెన్యూ కార్యాలయంలో సోమవారం సాయంత్రం వీఆర్వోలు, సర్వేయర్లతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ చెర్లోపాలెంలో జరుగుతున్న రీ సర్వే పనులు వేగవంతం చేయాలన్నారు. భూ వివాదాలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించాలన్నారు. ఈ–పంట నమోదుపై కూడా దృష్టి సారించాలని సూచించారు.

వైఎస్ జగన్ పర్యటనను విజయవంతం చేయాలి


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త ప్రసాద్

మునగపాక: నర్సీపట్నంలో ఈ నెల 9న జరగనున్న మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పర్యటనను విజయవంతం చేయాలని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ పిలుపునిచ్చారు. సోమవారం రాత్రి స్థానిక పార్టీ కార్యాలయంలో మునగపాక పంచాయతీ పరిధిలోని పార్టీ నాయకులతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత వైఎస్సార్‌సీపీ హయాంలో వైఎస్ జగన్ సీఎంగా ఉన్న కాలంలో అన్ని వర్గాల విద్యార్థులు, పేదలకు మేలు చేకూరేలా మెడికల్ కళాశాలలు మంజూరు చేశారన్నారు. అయితే వాటిని కూటమి ప్రభుత్వం ప్రైవేటపరం చేసేందుకు పూనుకోవడం దారుణమన్నారు. దీనిలో భాగంగా నర్సీపట్నం మెడికల్ కళాశాలను సందర్శించేందుకు వస్తున్న వైఎస్ జగన్‌కు ఘన స్వాగతం పలకాలన్నారు. కూటమి కుట్రలను తిప్పికొట్టాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, ఎంపీటీసీ బోడకుర్తి గణేష్, మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవరావు, సర్పంచ్ దిమ్మల అప్పారావు, పార్టీ నాయకులు ఆడారి కాశీబాబు, కోనపల్లి రామ్మోహనరావు, పెంటకోట సత్యనారాయణ, దాడి శ్రీరామమూర్తి, దాడి సూరిబాబు, టెక్కలి కొండలరావు, ఆడారి రమణబాబు, పెంటకోట శ్రీనివాసరావు, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కుంగిపోతున్న రోడ్డు


మునగపాక సమీపంలో కుంగిపోతున్న పూడిమడక రోడ్డు

మునగపాక: మండల కేంద్రమైన మునగపాక సమీపంలో పూడిమడక రోడ్డు కుంగిపోతోంది. ఈ మార్గంలో రాకపోకలు సాగించే వాహనచోదకులు ఆందోళన చెందుతున్నారు. మునగపాక సబ్‌స్టేషన్ దరి సాగునీటి కాలువ పక్కగా నిర్మించిన రహదారి కుంగిపోవడంతో అటు అచ్యుతాపురం వైపు అలాగే ఇటు అనకాపల్లి వైపునకు ప్రయాణం సాగించేవారు భయాందోళనకు గురవుతున్నారు. ఒకవైపు రోడ్డంతా కుంగిపోతుంది. ఏటవాలుగా వాహనాలు వెళ్లాల్సి వస్తుంది. ఎప్పుడు ఎలాంటి ప్రమాదాలు సంభవిస్తాయోనని కలవరపడుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి ప్రమాదాలు జరగకుండా చూడాలని కోరుతున్నారు.

సీపీఎం నాయకుల గృహ నిర్బంధంపై నిరసన


నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నర్సీపట్నం : రాజయ్యపేటలో బల్క్ డ్రగ్స్ ఫ్యాక్టరీ నిర్మాణానికి వ్యతిరేకంగా మత్స్యకారులు చేపట్టిన ఉద్యమానికి మద్దతుగా నిలిచిన సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజును గృహ నిర్బంధం చేయడం పోలీసులకు తగదని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు అడిగర్ల రాజు అన్నారు. ప్రజాస్వామ్య దేశంలో శాంతియుతంగా నిరసన తెలుపుకొనే హక్కు లేదా అని ప్రశ్నించారు. రాజ్యాంగం కల్పించిన హక్కులను పోలీసు నిర్బంధంతో ప్రభుత్వం కాలరాస్తుందన్నారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు బల్క్ డ్రగ్‌కు వ్యతిరేకంగా మాట్లాడిన సంగతి మర్చిపోయి ఇపుడు కూటమి ప్రభుత్వం మత్స్యకారుల పొట్టకొడుతున్నదన్నారు. తక్షణ మే అప్పలరాజుపై నిర్బంధాన్ని తొలగించా లన్నారు. లేకుంటే జిల్లా వ్యాప్తంగా పోరాటం చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఈరెల్లి చిరంజీవి, సాంబ పాల్గొన్నారు.

దేవరాపల్లి : సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు ఎం. అప్పలరాజును రెండు రోజులుగా పోలీసులు గృహ నిర్బంధం చేయడాన్ని ఖండిస్తూ దేవరాపల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో సోమవారం నిరసన చేపట్టారు. సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు డి.వెంకన్న మాట్లాడుతూ నక్కపల్లి మండలం రాజయ్యపేటలో బల్క్ డ్రగ్ పార్కును పెట్టొద్దని మత్స్యకారులు 20 రోజులుగా చేపడుతున్న ఆందోళనలో పాల్గొంటున్నారని అప్పలరాజును గృహ నిర్బంధం చేయడం దుర్మార్గమన్నారు. ప్రజాస్వామ్య దేశంలో ఆందోళనలు చేసే హక్కు ప్రజలకు ఉందని, ప్రజల హక్కులను కాలరాస్తే సహించేది లేదన్నారు. తక్షణమే అప్పలరాజుపై గృహ నిర్బంధాన్ని తొలగించాలని డిమాండ్ చేశారు. నిరసనలో సీపీఎం మండల కార్యదర్శి బి.టి.దొర పాల్గొన్నారు.

గుర్రాల పోటీల స్థలం పరిశీలన


గుర్రాల పోటీలు నిర్వహించే స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్‌ఐ తారకేశ్వరరావు

నాతవరం : మండల కేంద్రంలో మంగళవారం నల్ల కొండమ్మతల్లి పండగ సందర్భంగా ఏర్పాటు చేసిన గుర్రాల పరుగు పోటీలు నిర్వహించే స్థలాన్ని నాతవరం ఎస్‌ఐ వై.తారకేశ్వరరావు ఆలయ కమిటీ సభ్యులతో కలిసి సోమవారం పరిశీలించారు. నాతవరం గ్రామస్తుల ఆరాధ్య దైవం నల్లకొండమ్మ తల్లి పండగను ఏటా అక్టోబర్‌లో నిర్వహించడం ఆనవాయితీ. ఈ ఏడాది కూడా అమ్మవారి పండగ ఘనంగా నిర్వహించడానికి ఆలయ కమిటీ ఏర్పాట్లు చేసింది. పండగ సందర్భంగా గుర్రాల పోటీలు ప్రత్యేక ఆకర్షణగా నిలవనున్నాయి. ఆయా పోటీలు జరిగే స్థలాన్ని ఎస్‌ఐ పరిశీలించి నిర్వాహకులకు తగు సూచనలు చేశారు.

అంబేడ్కర్ విగ్రహం కాల్చిన వారిపై చర్యలు తీసుకోవాలి

దేవరాపల్లి : రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ విగ్రహాన్ని కాల్చిన వారిపై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్థానిక అంబేడ్కర్ యూత్ సంఘం, మండల అంబేడ్కర్ ఆశయ సాధన సంఘం డిమాండ్ చేసింది. దేవరాపల్లిలో సంఘ అధ్యక్షుడు కాటపల్లి అప్పారావు సోమవారం స్థానిక విలేకర్లతో మాట్లాడారు. జీడీ నెల్లూరు నియోజకవర్గం, వెదురుకుప్పం మండలం, దేవళంపేటలో గుర్తు తెలియని వ్యక్తులు అంబేడ్కర్ విగ్రహాన్ని కాల్చడం అమానుషమైన చర్యగా పేర్కొన్నారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే అంబేడ్కర్ విగ్రహాన్ని పునఃప్రతిష్ఠించాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా, దీనికి కారకులపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

జీఎస్టీ సవరణపై విద్యార్థులకు పోటీలు


వ్యాసరచన పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు


కోటవురట్లలో చిత్రలేఖనం పోటీలో పాల్గొన్న విద్యార్థులు


ధర్మవరం అగ్రహారం పాఠశాలలో పోటీలను పరిశీలిస్తున్న డిప్యూటీ డీఈవో అప్పారావు

మునగపాక: జీఎస్టీ సవరణపై స్థానిక మండల పరిషత్ హాలులో సోమవారం సాయంత్రం విద్యార్థులకు వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో నిర్వహించిన ఈ పోటీలను ఎంఈవోలు వేణుగోపాలరావు, శివనాయుడు పర్యవేక్షించారు. మండల స్థాయిలో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు జిల్లా స్థాయిలో పోటీలు ఉంటాయన్నారు.

నేడు జిల్లా స్థాయి పోటీలు

పాయకరావుపేట: మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. సోమవారం ఉదయం పాఠశాల స్థాయిలోను, మధ్యాహ్నం మండల స్థాయిలో పోటీలు నిర్వహించినట్టు ఎంఈవో జి.రమేష్‌బాబు తెలిపారు. మంగళవారం జిల్లా స్థాయి పోటీలు కొణంకోటలోని డీపీఎన్ హైస్కూల్‌లో వ్యాసరచన పోటీలు జరుగుతాయన్నారు.

కోటవురట్ల: స్థానిక పీఎంశ్రీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జీఎస్టీపై అవగాహన కోసం ఇన్‌చార్జ్ హెచ్‌ఎం సుకుమార్ ఆధ్వర్యంలో కె.వెంకటాపురం, జల్లూరు జెడ్పీ హైస్కూల్, స్థానిక జెడ్పీ బాలికోన్నత పాఠశాల, కేజీబీవీ విద్యార్థులకు మండల స్థాయిలో చిత్రలేఖనం పోటీ నిర్వహించారు. ఈ సందర్భంగా సుకుమార్ మాట్లాడుతూ చిత్రలేఖనం పోటీలో గెలుపొందిన విద్యార్థులను జిల్లా స్థాయి పోటీలకు తీసుకెళ్లనున్నట్టు తెలిపారు. జీఎస్టీ తగ్గించడం వల్ల కలిగే లాభాలను తల్లిదండ్రులకు వివరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు బి.ఎస్.ప్రసాద్, డేవిడ్, అప్పారావు, లోవరాజు, డ్రాయింగ్ టీచర్లు కృష్ణ, కిషోర్, విద్యార్థులు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: మార్కెట్‌లో కొనుగోలు చేసి వస్తువులపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విధించే జీఎస్టీపై పూర్తి అవగాహన ఉండాలని యలమంచిలి డిప్యూటీ డీఈవో పి.అప్పారావు సూచించారు. ధర్మవరం అగ్రహారం పాఠశాలలో సోమవారం విద్యార్థులకు జీఎస్టీ అమలుపై వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం ప్రశాంతి, ఉపాధ్యాయులు రమేష్, గారా ప్రకాష్, తదితరులు పాల్గొన్నారు.

నేడు వైఎస్సార్‌సీపీ మండల సమావేశాలు

రాంబిల్లి(అచ్యుతాపురం): వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 9న అనకాపల్లి జిల్లాలో పర్యటించనున్న నేపథ్యంలో మంగళవారం రాంబిల్లి, అచ్యుతాపురం మండలాల నాయకులతో సమావేశాలు నిర్వహించనున్నట్లు ఆ పార్టీ యలమంచిలి నియోజకవర్గ సమన్వయకర్త కరణం ధర్మశ్రీ తెలిపారు. ఉదయం 11 గంటలకు అచ్యుతాపురం మండల సమావేశం, సాయంత్రం 3.30 గంటలకు రాంబిల్లి మండల సమావేశం జరగనుందని పేర్కొన్నారు. ఆయా సమావేశాలకు పార్టీ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తరలిరావాలని ఆయన కోరారు.

మూడు గ్రామాల్లో రీ సర్వే ప్రారంభం

రాంబిల్లి(అచ్యుతాపురం): రాంబిల్లి మండలంలో మూడు గ్రామాల్లో రీ సర్వే ప్రారంభమైనట్టు తహసీల్దార్ శ్రీనివాసరావు తెలిపారు. ఎం.చింతువ, హరిపురం, వెల్చూరు గ్రామాల పరిధిలో రీసర్వేను ప్రారంభించామన్నారు. గతంలో నిలిచిపోయిన రీ సర్వే విషయంలో జాగ్రత్తలు తీసుకుంటున్నామని, ప్రధానంగా ప్రభుత్వ భూముల విషయంలో ప్రత్యేక దృష్టి సారించామని తెలిపారు.

ఫిర్యాదులు నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలి


ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఆర్డీవో వి.వి.రమణ

నర్సీపట్నం : పీజీఆర్ఎస్‌లో వచ్చిన ఫిర్యాదులను నిర్ణీత వ్యవధిలో పరిష్కరించాలని ఆర్డీవో వి.వి.రమణ అధికారులను ఆదేశించారు. సోమవారం నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో ఆర్డీవో ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. తన భూమిని అక్రమించిన వారిపై చర్యలు తీసుకుని న్యాయం చేయాలని రోలుగుంట మండలం, భోగాపురానికి చెందిన ఎం.సత్యనారాయణ ఆర్డీవోకు ఫిర్యాదు చేశారు. కోటా డీలర్ లైసెన్స్ రెన్యూవల్ చేయాలని కోరుతూ పాయకరావుపేట మండలం, పెంటకోటకు చెందిన ఎ.శివకృష్ణ, తన భూమిని ఆన్‌లైన్ చేయాలని కోరుతూ నర్సీపట్నం మున్సిపాలిటీ, బలిఘట్టంకు చెందిన ఆళ్ల ప్రసాద్, సాగులో ఉన్న భూమిని ఆన్‌లైన్ చేయాలని కోరుతూ నక్కపల్లి మండలం కాగిత గ్రామానికి చెందిన ఎ.వీర్రాజు అర్జీలు అందించారు. సంబంధిత అధికారులు ఆయా సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆర్డీవో సూచించారు.

అంధకారంపై గిరిజనుల వినూత్న నిరసన


కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న గిరిజనులు

రోలుగుంట : మండలంలో మూడు నెలలుగా చీకట్లో మగ్గుతున్న బాధిత గిరిజన గ్రామాల ప్రజలు సోమవారం రాత్రి కొవ్వొత్తులతో నిరసన తెలిపారు. బాధిత గ్రామాలకు చెందిన రెమ్మిలి అప్పారావు, వంతల చిన్న, గమ్మిడి చిలుకమ్మ మాట్లాడుతూ రోలుగుంట మండలం అర్ల పంచాయతీ నీళ్లబంద, రావికమతం మండలం సోంపురం బంద గ్రామాల్లో కొండు గిరిజనులు సుమారు 40 మంది జనాభా ఉన్నారని తెలిపారు. తమ గ్రామాలకు విద్యుత్ సౌకర్యం కల్పించాలని పలుమార్లు ఆందోళన చేయగా స్పందించిన అధికారులు విద్యుత్ సౌకర్యం కల్పించారని, అయితే పాత ట్రాన్స్‌ఫారం వేయడంతో అది కాలిపోయి మళ్లీ గ్రామంలో చీకట్లు అలముకున్నాయన్నారు. మూడు నెలలు గడిచినా అధికారులు సమస్య పరిష్కరించలేదని ఆరోపించారు. వెంటనే కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసి విద్యుత్ సౌకర్యం పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు.

పంటల నమోదుకు 25 వరకు గడువు

దేవరాపల్లి : పంటల నమోదుకు ఈ నెల 25 వరకు మాత్రమే గడువు ఉందని, ఈలోగా ప్రతి రైతు పంటల నమోదు ప్రక్రియను చేసుకోవా లని మండల వ్యవసాయ అధికారి ఎల్.వై.కాంతమ్మ సూచించారు. మారేపల్లిలో పంటల నమోదు ప్రక్రియను సోమవారం ఆమె పరిశీలించారు. రైతుకు ఉన్న ప్రతీ సర్వే నంబర్‌లో ను సాగు చేసిన పంటను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని అగ్రికల్చర్ అసిస్టెంట్ రామాంజలికి సూచించారు. రీసర్వే పూర్తి చేసిన గ్రామాల్లో కొత్త పాస్‌బుక్‌లు మంజూరవ్వడంతో ఈ ఏడాది 12,700 వరకు రైతులు ఉంటారని, వారంతా గడువులోగా పంటల నమోదుతో పాటు ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

విమ్స్ ఆధ్వర్యంలో నాణ్యమైన సరకుల పంపిణీ

రోలుగుంట : గ్రామాల్లో సమగ్ర మహిళా(విమ్స్) సంఘాల ఆధ్వర్యంలో నగదు చెల్లింపు వాయిదా పద్ధతిలో నాణ్యమైన సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. సోమవారం కొమరవోలు గ్రామంలో వాహనంలో నాణ్యమైన నిత్యావసర సరకులను తరలించి గ్రామస్తులకు పంపిణీ చేశారు. దీనికి ముందు కార్యక్రమం ఉద్దేశ్యం గురించి మండల ఎగ్జిక్యూటివ్ సభ్యురాలు రాజ్యలక్ష్మి అవగాహన కల్పించారు. మహిళల అభ్యున్నతే ప్రధాన లక్ష్యంగా ఈ సంఘాలు పని చేస్తాయన్నారు. సరుకుల పంపిణీ తాత్కాలిక సహాయం మాత్రమేనని, దశల వారీగా నిరుద్యోగ మహిళలకు స్కిల్ ట్రైనింగ్ కల్పించడం జరుగుతుందన్నారు.